

# కవి గారి కోరిక

ఒక కవిగార్కి తీరని కోరిక ఒకటి మిగిలిపోయింది. ఆంధ్రదేశం ఆయన కవిత్వానికి జేజేలు పలికింది. కాని ఆయనకింకా ఏదో లోటు కనిపిస్తున్నది. సన్మానాలు జరిగాయి. బిరుదులు యిచ్చారు. కాని ఆయనకి తన కవిత్వం ఆంగ్లంలోకి అనువదించబడ లేదని - ప్రపంచవ్యాప్తంగా తనకు పేరు రాలేదని బాధ ఉండిపోయింది.

ఒక రోజు అతని మిత్రుడు అవధాని-శాస్త్రగారిని చూడటానికి వచ్చాడు. కుశల సమాచారాలు అయిన పిమ్మట-యధాలాపంగా అడిగాడు అవధాని "మిత్రమా! నీ సాహిత్య వ్యాసాంగం బాగుందికదా? మునుపటిలా విజృంభించి ఆంధ్రులను అదరగొడుతున్నావు కదా!"

" ఏదోలే అవధాని! ఆంధ్రదేశంలో పుట్టడం నాదురదృష్టం–" చప్పరించేశాడు శాస్త్రి.

అతని మాటలకు - అతని చేష్టలకు నివ్వెరపోయాడు అవధాని.

" అదేంటి శాస్త్రి ! నీకిప్పుడు ఏం తక్కువైంది. ఎన్నో బిరుదులు - సన్మానాలు - సత్కారాలు అందుకున్నావు. అంతకంటే ఎవరు మటుకు ఏం చెయ్యగలరు?" అవధాని అడిగాడు అతని మనసు తెల్సుకోవాలని.

" అది కాదురా ! నా కవిత్వం ఆంగ్లంలోకి అనువదించబడి ఉంటే నాకు ప్రపంచం నలుమూలల నుండి గుర్తింపు లభించేది ! ఆంగ్లం ప్రపంచ భాష! ప్రపంచంలోని అందరు ప్రజలు చదివి మెచ్చుకొనేవారు! నాకు ఆ అదృష్టం లేదు - " నిట్టూర్చాడు శాస్త్రి.

" శాస్త్రీ ! కొత్తగా ఈ ఇల్లు కట్టించి ఈ ఇంట్లోకి మారావు కదూ - నీ చిరునామా కనుక్కోవడం నాకు చాలా కష్టమైపోయింది." అవధాని చెప్పాడు.

" అరే ! మనపేరు చెబితే ఎవరైనా చెబుతారే !" ఆశ్చర్యంగా అన్నాడు.

" అనే అనుకున్నాను - కాని నీ చిరునామాను విచారించుకుంటూ వచ్చే సరికి నాదుంపతెగింది. మీ వీధిలో కూడ సరిగా చెప్పలేదు. అంతెందుకు నీ పక్కింట్లో కూడ నీ

పేరు తెలీదు. మళ్ళీ నేను వీధి అంతా తిరిగి చివరికి ఓ ముసలాయన దయవలన కనుక్కోగలిగాను" బాధగా చెప్పాడు.

" అయ్యో ! అవధాని ! నాకు కాకితో కబురు చేస్తే వచ్చి వాలేవాడిని!" నొచ్చుకుంటూ అన్నాడు.

" సరే ఆ కాకి దొరకలేదు - దాన్ని ప్రక్కనపెట్టు - ప్రపంచ ప్రజలు నిన్ను గుర్తించ లేదంటున్నావు - నిన్ను నీ వీధిలో వాళ్ళే గుర్తించ లేకుండా ఉన్నారు - ఆ మాటకొస్తే మీ యింట్లోనే నీకిచ్చే విలువ నాకు రాగానే అర్థమయిపోయింది. నువ్వు నాకు అల్పాహారం యిమ్మంట మీ కోడలు అయిపోయిందని సెలవిచ్చింది... పానీయం తెమ్మంటే మీ ఆవిడ పనిలో ఉన్నానని చెప్పింది." బాధగా అన్నాడు అవధాని. " దాందేముంది - ఎవరి సమస్యలు వారివి ! ఎవరి పని ఒత్తిళ్ళు వారివి! వారెవరో నాకు సరియైన సమాధానం చెప్పనంత మాత్రాన నాకున్న గౌరవం తగ్గుతుందా?" శాస్త్రి సమర్థించుకుంటూ చెప్పాడు.

" సరే గాని.... ఈ వీధిలో నీ పేరు చాలామందికి ఎందుకు తెలియదు".

" అది వాళ్ళ అజ్ఞానం - నా అంతటి పెద్దమనిషి ఈ వీధిలో ఉండటం వారి అదృష్టం - నా గురించి తెల్సుకోవలసిన బాధ్యత వారికుంది."

" అలాగే - వారి గురించి కూడ తెల్సుకోవలసిన బాధ్యత నీకుంది! ఈ కాలం ఎవరికి వాళ్ళే గొప్ప ! పెద్దంతరం చిన్నతరం లేనే లేదు." అవధాని.

" అలా అంటే ఎలా ? నేను కవిని! సమాజ నిర్దేశకుడిని! నా అక్షరాలు శాశ్వతాలు! ఈ వెర్రి వెధవలు గుర్తించకపోయినా నా కవిత్వం ఆంగ్లంలోకి వెళితే నాకు మహారాజ వైభవం ఖాయం !" శాస్త్రి ఆత్మవిశ్వాసం.

" శాస్త్రీ ! నీ కవిత్వం మీద నీకు అంత నమ్మకం ఉంటే మంచిదే ! కాకి పిల్ల కాకికి ముద్దు ! కాని ఎందుకోసం నువ్వు ఆంగ్లంలోకి నీ కవిత్వం అనువదించబడాలని కోరుకుంటున్నావు?" అడిగాడు అవధాని.

" చెప్పాగా ! అది విశ్వజనీనం - దాంలో నా పుస్తకం వెలువడితే అందరూ చదువుతారు - నన్ను మెచ్చుకుంటారు." కలలు కంటూ చెప్పాడు శాస్త్రి.

" భేష్ ! ఏదైనా ఇంట గెల్చి రచ్చ గెలవాలంటారు. ఇన్ని పుస్తకాలు నువు సమాజం మీదకి వదిలావు - ఎంత మంది నీ పుస్తకాలు చదివారు? ఎంత మంది బాగుందని మెచ్చుకున్నారు? చెప్పు !" అవధాని నిలదీశాడు.

" వీళ్ళు చదవకపోతే ఏం - గాడిదకేం తెలుసు గంధపు చెక్క రుచి? విశ్వం మొత్తం చదివితే చాలు!" మొండిగా చెప్పాడు శాస్త్రి.

" అంతదాకా ఎందుకు - మీ ఆవిడ - అదే మా చెల్లెమ్మ నీ పుస్తకాలు చదివిందా? నీ కుటుంబంలో ఎంత మంది చదివారు ? నీ స్నేహితులు చదివారా? ఈ వీధిలో ఎంత మంది చదివారు? ఒక్కళ్ళూ చదవలేదు - పోనీ చదివిన వాళ్ళు ఎంత మంది మెచ్చుకున్నారు-" నిలదీశాడు అవధాని.

" వీళ్ళతో నాకు పనిలేదు- తెల్లవాడు మెచ్చుకుంటే చాలు !"

" అదే బానిస రక్తం అంటే ! వాడికేం కొమ్ములొచ్చాయా? వాడికి మనకంటే ఎక్కువ తెలివి తేటలున్నాయా? మన చెత్త చదవడం తప్పించి వాడికంత కంటే పనిలేదా? తల్లి నాలుకలో రాసి తోటివారితో చదివించుకో లేనివాడికి - పరాయి భాషల ప్రజల మెప్పుకోలు ఎందుకు? ముందు నీ వాళ్ళను మెప్పించు - ఆ మెప్పుదల చాలు మనకు - వాడెవడో చదవలేదని - వాడెవడో మెచ్చుకోలేదని దిగులు పడితే నీ కొచ్చింది కూడ రాయడం మర్చిపోతావు?" బాగా చివాట్లు పెట్టాడు అవధాని.

శాస్త్రికి కనువిప్పు అయింది. ఆ రోజు నుండి తనకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు రాలేదని బాధపడలేదు. తన రచనలు ఆంగ్లంలోకి అనువదించ బడలేదని నిరాశ పడలేదు.

*(7-4-2008 ఉగాది శంఖారావం పత్రిక)*




మా నాన్న రచయిత గదా! ఇంటి నిండా పుస్తకాలే!?
మా డాడీ! మంత్రి గదా! ఇంట్లో ఎక్కడ చూసినా డబ్బే!!


తాత ఆస్తి అంతా నా పేర్న రాశాడు! ఇంక అమ్మాయినిచ్చివాళ్ళకి లక్షలలోనే టోపా కట్టేస్తాడు!!


టైమెంత!?
సిన్న ఇదే సమయానికి నాలుగు అయింది!!


అమ్మాజీ! ఇంటర్ నెట్ లో ఆ సినాజి చూడు! నా హీరోయిన్ ని ఎలా రేప్ చేస్తున్నాడో!!
సినీ విలన్